క్లుప్తంగా

కుల, మతాలకు అతీతంగా పండుగలు అభినందనీయం



హనుమాన్‌జంక్షన్ రూరల్: కుల, మతాలకు అతీతంగా హిందూ, ముస్లింలు కలిసి మెలసి విజయదశమి ఉత్సవాలు నిర్వహించటం అభినందనీయమని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం డాక్టర్ దుట్టా పాల్గొన్నారు. దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి డాక్టర్ దుట్టా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలో భారీ అన్నదానం చేశారు. వార్డు సభ్యులు కడవకొల్లు నాగరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు కంచర్ల సత్యనారాయణ, కడవకొల్లు రాజేష్, అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత నూలు నరసింహారావు పాల్గొన్నారు. స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

చర్చి నిర్మాణానికి రూ.50వేలు వితరణ



గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి సీఎస్ఐ చర్చి నిర్మాణానికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య ఆదివారం రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఆయన తల్లిదండ్రులు తోట సీతారామయ్య, సీతారావమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని చర్చి నిర్మాణానికి అందజేసినట్లు చెప్పారు. పాస్టర్ కాటూరు ఆమోసు, పెద్దలు పాల్గొన్నారు.

జయహో దుర్గాభవానీ



చినకంచిలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు



యాదవ రామాలయంలో పసుపు కొమ్ములతో పూజలు



ఉయ్యూరు అంకమ్మతల్లి ఆలయంలో కుంకుమ పూజలు



మహిషాసురమర్దినీదేవిగా దర్శనమిచ్చిన పేరంటాలమ్మ



కంకిపాడు శివాలయంలో దుర్గాదేవి అలంకారం



యనమలకుదురులో మహాగౌరీదేవిగా..

ఉయ్యూరు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు ఆదివారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. అమ్మా.. దుర్గమ్మా.. చల్లంగ చూడమ్మా.. దుర్గాదేవి నమోస్తుతే అంటూ మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఉయ్యూరు పట్టణంలోని శివాలయం, విజయ దుర్గాభవాని దేవి ఆలయం, పెద ఓగిరాల, ముదునూరు శివాలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆరేపల్లి వంశస్తుల ఇలవేల్పు అంకమ్మతల్లి ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమపూజలు చేశారు.

కనకదుర్గాదేవిగా దర్శనం..

నున్న(విజయవాడరూరల్): దేవీనవరాత్రుల 8వ రోజు ఆదివారం చినకంచి చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి ఆలయంలో అమ్మవారు కనకదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, భక్తులు అమ్మవారికి అభిషేక అర్చనలు చేసి విశేషభోగాలను సమర్పించారు. సువాసినిల చేత కుంకుమపూజలు చేయించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. షిర్డీ సాయిబాబా మందిరంలో అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేషంగా అలంకారం చేసి శ్రీచక్రానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. చెరువు సెంటర్లోని శ్రీదుర్గాదేవి దేవస్థానంలో అమ్మవారి విశేష పూజలు చేశారు. పాతపాడు గ్రామశివారు సీతారామపురం గ్రామంలో అమ్మవారు దుర్గాష్టమినాడు కనకదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా అలంకారం చేసి పూజలు చేశారు. పి.నైనవరంలోని శివనాగేంద్రస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాష్టమినాడు శ్రీకనకదుర్గదేవి ఆలయంలో భక్తులకు దర్శనమివ్వగా భక్తులు పూజలు చేశారు. అంబాపురం గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో కనకదుర్గమ్మగా దర్శనమిచ్చారు.

మహిషాసుర మర్దినీదేవిగా పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు మహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయంలో ఓం నామ శివాయ ఏకాహమును నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన, నీరాజనం మంత్రపుష్పం పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం ఆధ్వర్యంలో జాతీయరహదారిపై పాదచార భవానీ, అయ్యప్ప స్వాములకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఈవో పి. లోకేశ్వరి పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనం.

గన్నవరం: శ్రీదేవీశరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక యాదవ రామాలయంలో శ్రీదుర్గాదేవి సన్నిధిలో భక్తులు పసుపు కొమ్ములతో పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో చిక్కవరపు హరిష్, శిరీష దంపతుల సౌజన్యంతో సహస్ర దీపోత్సవం నిర్వహించారు. పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రీదుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగాయత్రి మందిరంలో చండీ హోమం నిర్వహించారు.

వైభవంగా దేవీ నవరాత్రులు..

కంకిపాడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఈడుపుగల్లు శివాలయంలో ఉదయం దుర్గాదేవిగానూ, సాయంత్రం మహిషాసురమర్దినిగానూ భక్తులకు దర్శనమిచ్చారు. కంకిపాడు శివాలయంలో దుర్గాదేవిగానూ, ప్రొద్దుటూరు శివాలయంలో మహిషాసురమర్దినిగానూ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారు విజయలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు.

మహిషాసురమర్దినీదేవిగా అమ్మవారు

పెనమలూరు: యనమలకుదురు శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పోరంకి శ్రీ షిర్డీసాయి మందిరంలో, పెదపులిపాక శ్రీ విజయరాజ రాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో 8వ రోజు శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీమహాగౌరిదేవి దివ్య అలంరణ చేశారు. అమ్మవారికి చండీహోమం, సామూహిక కుంకుమార్చన చేశారు.

అత్తింటి వారిపై వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు లంబాడీపేటకు చెందిన సజ్జాహేమలత మూడేళ్ల క్రితం పామర్రుకు చెందిన సజ్జారాజేష్‌తో వివాహం అయ్యింది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి పాప పుట్టింది. పాప పుట్టిన తర్వాత అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. అదనపు కట్నం తీసుకురమ్మని భర్త రాజేష్, అత్త మంగ, బావ చింతయ్యలు వేధించసాగారు. దీంతో బాధితురాలు పుట్టింటికి వచ్చేసింది. అత్తింటివారితో తనకు తన కుమార్తెకు ప్రాణాపాయం ఉందని, అదనపు కట్నం తీసుకురమ్మంటున్న అత్తింటి వారిపై చర్యలు తీసుకోవాలని హేమలత తల్లి పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధికి కేరాఫ్‌గా కానూరు

- సీఎం జగన్ పాలనలో వేగంగా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



కానూరులో రోడ్డుపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అభివృద్ధి పనులు వేగంగా చేపట్టామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన తాడిగడప మునిసిపాలిటీ పరిధి కానూరు ప్రాంతంలో రూ. 13.59 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులు ప్రారంభించి, నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అభివృద్ధి–సంక్షేమం రెండు కళ్లగా అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ ఫలాలు ఇప్పటికే ప్రతి పేదవారి ఇంటికి చేరాయన్నారు. అభివృద్ధి విషయానికి వస్తే గతంలో లేని విధంగా పెనమలూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంకులు నిర్మాణం చేశామని తెలిపారు. అభివృద్ధి ఎక్కడ జరిగిందని టీడీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని, తనతో టీడీపీ నేతలు వస్తే తాము నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూపిస్తామన్నారు.

కానూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

కానూరు ప్రాంత అభివృద్ధికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గత టీడీపీ పాలనలో కానూరు అభివృద్ధిని పూర్తి నిర్లక్ష్యం చేశారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎవ్వరి పట్ల విచక్షణ చూపకుండా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేశామన్నారు. కానూరులో ఇప్పటికే దాదాపు రూ. 13.50 కోట్లు పనులు చేశామని తెలిపారు. టీడీపీ ప్రచార ఆర్భాటమే తప్ప ఎక్కడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. టీడీపీ హయాంలో జరిగిన పలు పనులు తాను మంత్రిగా ఉన్న కాలంలో మంజూరు చేసిన గ్రాంటుతో చేసినవని తెలిపారు. అన్నిప్రాంతాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, తాడిగడప పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్ కుమార్, నేతలు చాంద్‌బాషా, నేరెళ్ల బుజ్జి, తాళ్ల నరేంద్ర, అంగిరేకుల సీతారామయ్య, వేమూరి బాలకృష్ణ, ఆంజనేయప్రసాద్, శ్రీరాములు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ-జనసేన నేతలు

పెనమలూరు: కానూరుకు చెందిన టీడీపీ-జనసేన నేతలు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సమక్షంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. కానూరుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కానూరు మురళీనగర్‌కు చెందిన కొల్లి ధనేష్ నాయకత్వంలో దాదాపు 25 మంది టీడీపీ జనసేన నేతలు వైఎస్సార్ సీపీలో చేరగా ఎమ్మెల్యే పార్థసారథి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



నూర్‌బాషా, దూదేకుల సంక్షేమానికి తోడ్పాటు

గన్నవరం: నూర్‌బాషా, దూదేకుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని రకాల తోడ్పాటునందిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమర్తి చిన్న మస్తాన్ పేర్కొన్నారు. మండలంలోని పామర్తినగర్‌లో ఆదివారం నూర్‌బాషా, దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కొత్తగా నియమితులైన గన్నవరం నియోజకవర్గ గౌరవ సలహాదారు ఎస్‌కే వలి, గన్నవరం మండల అధ్యక్షుడు షేక్ ఆదాంవలి, మండల మహిళా అధ్యక్షురాలు ఎస్‌కే జమలాబి, పెనమలూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా షేక్ ఖాదర్‌బీకి నియామక పత్రాలను అందజేశారు.

వైద్య కళాశాలకు విశ్రాంత ఉపాధ్యాయుడి భౌతికకాయం



ఉంగుటూరు: విద్యా బోధనలో తరించిన ఓ ఉపాధ్యాయుడి భౌతికకాయం మరణానంతరం కూడా వైద్య విద్యకు ఉపయోగపడనుంది. దశాబ్దాలుగా తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలు అందించిన విశ్రాంత ఉపాధ్యాయుడి భౌతికకాయం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగిస్తున్నారు. ఉంగుటూరుకి చెందిన సూర్యదేవర రఘుపతిరావు(83) తెలుగు ఉపాధ్యాయులుగా సుదీర్ఘకాలం పాటు సేవలు అందించి 2008లో పదవీ విరమణ చేశారు. కాగా వయోభారంతో ఆయన ఆదివారం తుదిశ్వాస విడిచారు. అయితే తన భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడే విధంగా ఉండాలని భావించి ఒప్పంద పత్రం ముందుగానే రాసిచ్చారు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు రఘుపతిరావు పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించడానికి సిద్ధమయ్యారు. సోమవారం ఆయన భౌతిక కాయాన్ని సిద్ధార్థ వైద్య కళాశాలకు అప్పగించనున్నట్లు కుమారుడు సూర్యదేవర రామకృష్ణ తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముందుకు రావాలి



గన్నవరం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పిలుపునిచ్చారు. స్థానిక కోనాయి చెరువు నుంచి వీఎస్ పురం కాలనీ వరకు హరివిల్లు సంస్థ రూ. 50 వేలు వ్యయంతో ఏర్పాటు చేసిన 20 ఎల్ఈడీ స్ట్రీట్ ఎల్ఈడీ లైట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

● కోడి పందేలు ఆడుతున్న ఆరుగురు అరెస్టు

పెనమలూరు: తాడిగడపలో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప చెరువు వద్ద కొందరు వ్యక్తులు కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. వీరి దాడిలో కోడి పందేలు ఆడుతూ ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ. 20,200 సొమ్ము, ఆరు బైక్‌లు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

● భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

పెనమలూరు: భార్య అదృశ్యమయిందని భర్త ఫిర్యాదు చేయటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన దుర్గావెంకటేష్ బోర్లు పని చేస్తాడు. అతను ఈ నెల 17వ తేదీన తన తల్లి ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. అతను తిరిగి ఇంటికి వచ్చే సరికి భార్య యామిని ఇంట్లో లేదు. ఆమె కోసం వెతికినా ఆమె జాడ తెలియలేదు. ఆమె వద్ద ఉన్న ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఈ ఘటనపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనమలూరు: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాల బీసీ కాలనీకి చెందిన బొబ్బా సృజన 17ఏళ్ల క్రితం బొబ్బా వెంకటకాళీ ప్రసాద్‌ను(46) వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త మద్యానికి బానిసగా మారడంతో అతను చేస్తున్న ప్రైవేటు ఉద్యోగం పోయింది. దీంతో భార్య గత రెండేళ్లుగా పుట్టింట్లోనే ఉంటుంది. అయితే ప్రసాద్‌కు 16వ తేదీన ఫిట్స్ రావటంతో అతను రోడ్డుపై పడిపోయి తలకు గాయమయింది. గాయపడిన అతనిని విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బొబ్బా వెంకటకాళీప్రసాద్ ఆదివారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

● మాదిగలు అంతిమ పోరాటానికి సిద్ధం కావాలి

గన్నవరం రూరల్: మాదిగలు అంతిమ పోరాటానికి సిద్ధం కావాలని నియోజకవర్గ మహాజన సోషలిస్ట్ పార్టీ ఇన్‌చార్జి మందా వేణుబాబు మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని పురుషోత్తమపట్నం, కట్టుబడిపాలెం గ్రామాల్లో ఆదివారం జరిగిన ఆ పార్టీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని అధికారంలోకి వచ్చి 10 ఏళ్లు కావొస్తున్నా గడిచిందని అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అందుకే గ్రామాల్లో పర్యటిస్తున్నామన్నారు. ఇది అంతిమ పోరాటమని మాదిగలు సిద్ధం కావాలని చెప్పారు. ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పురిటిగడ్డ దేవదాసు కోట కృష్ణమోహన్, చౌటపల్లి ప్రదీప్, కోట కొండలరావు, కూచిపూడి పున్నయ్య, కొవ్వలి రాజు పాల్గొన్నారు.

● గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

ఉంగుటూరు: తేలప్రోలు వద్ద ఏలూరు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఆదివారం లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేలప్రోలులో ఏలూరు కాలువలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 60నుంచి70 సంవత్సరాల వయసుంటుందన్నారు. అయిదు అడుగులు ఎత్తు కలిగి, నేరేడు రంగు మీద సిమెంట్ రంగు చారలు గల చీర, నేరేడు రంగు జాకెట్ ధరించి ఉందన్నారు. తెలుపు, నలుపు రంగు జుట్టు ఉంది. మహిళ వివరాలు తెలిసిన వారు ఆత్కూరు పోలీస్ స్టేషన్ ఫోన్ నంబరు(9491152837)ను సంప్రదించాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

పంచాయితీరాజ్ శాఖ - మండల ప్రజాపరిషత్

ఉయ్యూరు

ఆర్.సి.నెం. 55/2017/బి   తేది : 21-10-2023

ఉయ్యూరు నగర పంచాయితీ పాత భవనము మరియు 4 భవనములు కూల్చివేయుటకు బహిరంగ వేలము నోటీసు

కృష్ణాజిల్లా చైర్‌పర్సన్ వారి ఆమోదము అనుసరించి ఉయ్యూరు మండలము నందు ఉయ్యూరు నగర పంచాయితీ పాత భవనము మరియు 4 భవనములు కూల్చివేయుటకు బహిరంగ వేలము ది. 28-10-2023వ తేదీన సాయంత్రం 3-00 గం॥లకు ఉయ్యూరు నగర పంచాయితీ నందు జరుగును.

కావున దానికి సంబంధించిన అప్సెట్ ప్రైజ్ రూ. 1,60,070/-లు.

షెడ్యూలు వివరములు :

1. వేలము కొరకు దరఖాస్తు స్వీకరించు తేదీ : 28-10-2023 సాయంత్రం 3-00 గం॥లోపు
2. బహిరంగ వేలము అనంతరము ది. 28-10-2023న తక్షణమే వేలము తాలూకు నగదు సదరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారికి అప్పగించవలసినదిగా తెలియజేడయమైనది. మరియు సదరు నగదు జిల్లా పరిషత్ వారి జనరల్ ఫండ్‌కి చలానా కట్టవలసినదిగా తెలియజేయడమైనది.

జె. విమాదేవి,
మండలపరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజాపరిషత్, ఉయ్యూరు